

# చూపు

కుముదకుమారి

రాజుకి పొద్దుపోవడంలేదు. సింహాసనం ఎక్కిననాటి నుండీ యుద్ధాల వెంట యుద్ధాలూ, విజయాల వెంట విజయాలుగా గడిచిన అతడి జీవితానికి పొద్దు చాలకపోవడం మాత్రమే తెలుసు.

విశ్వవిజేతగా ప్రకటించుకున్ననాటి నుండీ ఎదురన్నదే లేకుండాపోయాక ఏర్పడిన కొత్త సమస్య ఇది.

పొద్దు గడవకపోవడం... కుప్పలు తెప్పలుగా సమకూర్చుకున్న ఆయుధాల గుట్టల మధ్య చేతులు ముడుచుకొని కూర్చోవలసి రావడం...

అతని నిట్టూర్పుల సెగలకి గదిలో ఉన్న వారం దరి గుండెలూ గుబగుబలాడాయి.

అపరాహ్ణం కావొస్తూంది.

కిటికీలోంచీ దూరంగా జనంతో కిక్కిరిసి ఉన్న సభామంటపం కనిపిస్తూంది. అంత ఎత్తు నుంచీ చూస్తుంటే చీమల్లా కనిపిస్తున్నారు ప్రజలంతా.

కవి పండితులూ, కళాకారులూ, గోడు చెప్పుకొనే అవకాశమైనా దొరుకుతుందేమోనని ఆశపడి వచ్చిన పేదసాదలూ పొద్దుటి నుండీ అలాగే పడి ఉన్నారు.

ఆరోజుకిక రాజ దర్శనం దొరకదని వాళ్లకి అర్థమై పోయింది. కానీ రాజాజ్ఞ లేనిదే బయటికి పోయే అవ కాశం లేక ఉసూరుమంటూ అలాగే ఉండిపోయారు.

ముసలి మంత్రి మరి ఉండబట్టలేకపోయాడు.

"ప్రభూ! మన్నించాలి. ప్రజలంతా తమ దర్శనా ర్థమై..." రాజు చూపుల్లోని వాడికి అతడి మాట సగంలో ఆగిపోయింది.

"ఒత్తి తిండిదండగ మూక..." కసిగా గొణిగాడు సేనాని. "ప్రభువు ఒక్క కనుసైగ చేస్తే చాలు. ఈ మూక నంతట్నీ తెగనరికి పడెయ్యనా..."

యుద్ధాలు లేక రాజులాగే అతడికీ పొద్దుపోవడం లేదు. అతడి గొణుగుడు విని ఉలికిపాటుతో రాజుని చూశాడు మంత్రి. రాజు అదేం విన్నట్టు కనబడలేదు. ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. ఉన్నట్టుండి అతని నొసలు ముడిపడింది. కళ్లు మరింత ఎర్రగా వెలిగాయి.

మంత్రి గుండె భయంతో వణికింది. అడవి అంటుకున్నా నీళ్లతో ఆర్పొచ్చునేమోగానీ రాజు కంటి మంట ప్రజల నెత్తురుతోగానీ చల్లారదని అతడికి బాగా తెలుసు.

అతడి ఉలికిపాటు చూసి నవ్వుకున్నాడు విదూ షకుడు. రెండడుగులు ముందుకి వేసి రాజు ముందు మోకరిల్లాడు. విధేయతను ప్రకటించడంలో విదూష కుడిని మించినవారు లేరు. రాజుకి అతడంటే ప్రత్యేక మైన అభిమానం.

"ప్రభూ! నాదొక మనవి. నిరంతర రాచకార్య నిర్వహణ వల్లనేనేమో తమకీ అశాంతి. కొద్దికాలంపాటు వీటికి దూరంగా క్రీడా వినోదాలతో గడిపితే..."

విదూషకుడి భావం గ్రహించాడు సేనాని.

"అవును ప్రభూ! తమరు అనుమతిస్తే వేటకి ఏర్పాట్లు..." రాజు నొసటి ముడివీడింది. ఆవేదన పోయి ఆనందంతో ముఖం కలకలలాడింది. 'వేట! తనకి అత్యంత ఇష్టమైన క్రీడ...! దిక్కులు దద్దరిల్లే సంరంభం తో తను వేటకి బయలుదేరి వెళుతుంటే...

ఆకాశం వణికి పక్షులని నేలరాల్చేది.

జంతు కళేబరాల గుట్టలు పడి భూమి కంపించి పోయేది.

తన గుర్రపుడెక్కల చప్పుళ్లకు భీతిల్లి అరణ్యాలే మూర్ఛపోయేవి.

ఇదంతా ఒకనాటి సంబరం. ఇప్పుడు అడవులన్నీ బోసిపోయాయి. మిగిలిన ఒకటీ అరా జంతువులని తనే దయదల్చి వదిలేశాడు వాటి సంఖ్య పెరగడం కోసమని.

వాటి సంఖ్య ఏనాటికి పెరిగేను..!' నిట్టూర్చాడు రాజు. రాజు ఆలోచన గ్రహించాడు విదూషకుడు.

"ప్రభూ! కొంత శ్రమకోర్చి దూరానున్న శక్తి పర్వతాలకు వెళితే? అక్కడ కోకొల్లలుగా జంతువులుంటాయని విన్నాను..."

"సరే! ఏర్పాట్లు కానివ్వండి"

మంత్రి ధైర్యం కూడదీసుకుని ముందుకొచ్చాడు.

"ప్రభూ! మన్నించండి. నాదొక మనవి. దేశమంతటా కరువు తాండవిస్తూంది. హింసలూ, దౌర్జన్యాలూ, దొంగతనాలూ చెలరేగిపోతున్నాయి. బాధలను తాళలేక ప్రజలు అల్లాడిపోతున్నారు. దయగల ప్రభువులు తమ గోడు పట్టించుకోకపోతారా అని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. ఈ పరిస్థితిలో తమరు రాజధానిని విడిచి వేటకు వెళ్లడం..."

రాజుకి పట్టలేని కోపం వచ్చింది. కానీ ఆపుకున్నాడు. 'ఈ ముసలివాడి మీదనా తన ప్రతాపం...' లేచి నిలుచున్నాడు.

"రెండ్రోజుల్లో ఏర్పాట్లు పూర్తి కానివ్వండి..."

అంటూ నిర్లక్ష్యంగా బయటికి నడిచాడు. అతడిని అనుసరించారు మిగతావారు. నిశ్చేష్టుడై నిలబడిపోయాడు మంత్రి.

*

ఎదురులేకుండా సాగిపోతూంది రాజు వేట. ఒళ్లు తెలియని ఉత్సాహంతో పరిసరాలు మరచి అరణ్యపు లోలోతుల్లోకి ఎవరూ చొరబడలేనంత మారుమూలల్లోకి దూసుకుపోతున్నాడు రాజు.

బిక్కుబిక్కుమంటూ అతన్ని అనుసరిస్తున్నారు మందీమార్బలం. అలా వెళుతున్న రాజు హఠాత్తుగా ఆగిపోయాడు.

సుదూరంగా ఏదో ధ్వని. అలలు అలలుగా వచ్చి అతని చెవులను తాకసాగింది.

ఏమిటది...!? సెలయేటి గలగలా... ఊహుఁ!

జలపాతపు హోరా... ఊహుం! అదీ కాదు.

ఏదో వాయిద్యపు మోతలా ఉంది. అందులో ఏదో కొత్తదనం, ఆకర్షణా. తన ఆస్థాన విద్వాంసులు తన ముందు వణుకుతూ వినిపించే సంగీతంలా లేదు. హాయిగా, స్వేచ్ఛగా, నిర్భయంగా ఆ అడవిలో మారుమోగుతూంది.

రాజు బిగుసుకుపోయాడు. తలనించీ పాదాల దాకా ఏదో వణుకూ, నిస్సత్తువా ఆవరించినట్లై చికాకు పడ్డాడు.

అతడికి మరి వేట మీద మనసు పోలేదు. అమాయకంగా గంతులేస్తూ వచ్చి తన ముందు నిలబడిపోయిన లేడిపిల్లని చంపడం కూడా మరిచిపోయి, ఆ శబ్దాన్ని వెంటాడుతూ ముందుకి సాగాడు.

అక్కడ... అడవి అంతమైనచోట -

విశాలమైన బయలుప్రదేశం ఒకటి ఉంది. ఎటు చూసినా పచ్చని పంటచేలూ, పళ్లతోటలూ, పూలవనాలూ... వినీలాకాశం కింద స్వేచ్ఛగా ఎగురుతున్న రంగురంగుల పక్షులూ... ఆ దృశ్యం ఒక మనోహర వర్ణచిత్రంలా ఉంది.

దూరంగా చేలో మంచె మీద కూర్చొని ఉన్నారెవరో. సంగీతం అక్కడినించే వినిపిస్తూంది.

ఎంత సౌందర్యం...!!

నివ్వెరపాటుతో ఆ దృశ్యాన్ని చూస్తూ నిలబడిపోయాడు రాజు. కొన్ని క్షణాల తర్వాత తేరుకొని ముందుకు కదలబోయాడు.

అప్పుడు గమనించాడు. అటు పోవడానికి వీలు లేకుండా కనుచూపు మేరంతా ముళ్లకంచె ఆవరించి ఉంది.

"ఎవరక్కడ...! తక్షణం ఈ కంచెని ఛేదించండి."

భటులు ముందుకొచ్చి కంచెని తొలగించబోయారు. భయపడుతూ వారిని వారించాడు మంత్రి.

"మహాప్రభూ! మన్నించండి. అనుమతి లేనిదే మనం ఆ ప్రాంతంలో అడుగుపెట్టడం అంత క్షేమకరం కాదేమో..."

"నాకు...! ఒకరి అనుమతి కావాలా... మంత్రీ! నీ జ్ఞానం నశించిందా?"

"క్షమించండి మహారాజా! మన అధీనంలో లేని అతికొద్ది ప్రాంతాలలో ఇదొకటి. ఈ భూమి పేరు సుచేతన. ఇక్కడి ప్రజలు మహా బలవంతులు. అమిత మేధావంతులుగా ప్రసిద్ధి చెందినవారు. వీరు ఒకరి జోలికిపోరు. అన్యాయంగా తమ జోలికి వచ్చినవారిని అంతు చూడందే వదలరు..."

రాజు నిశ్చేష్టుడయ్యాడు. నిరాశపడ్డాడు.

ఈ భూమి! ఇంత సుందరభూమి! తన అధీనంలో లేనిదా... పైగా ఇంతటి శక్తివంతుల అధీనంలో వున్నదా...! వారు తనకన్నా బలవంతులా... ఊహుఁ వీల్లేదు వీల్లేదు. ఇంతవరకూ తన కంటిని ఆకట్టుకున్నదేదీ తనది కాకుండాపోలేదు. ఇది మాత్రం...

రాజు ఆలోచన గ్రహించినవాడిలా చిరునవ్వు నవ్వాడు విదూషకుడు. రెండడుగులు ముందుకు వేసి రాజుతో ఏదో అనబోయాడు.

అంతలో... వీరి అలికిడిని గ్రహించిన మంచెమీది ఆకారం మంచె దిగి వీరివైపు రాసాగింది.

ఆ వచ్చేది ఒక స్త్రీ.

ఆమెని ఆశ్చర్యంగా చూశాడు రాజు.

ఆమె తన దేశపు స్త్రీలలా నాజూకుగా నాగరీకంగా లేదు. చాలా ఎత్తుగా, బలంగా నల్లని శరీరఛాయతో ఉంది. కానీ అంత ముతకనార గుడ్డల్లో కూడా అందం గానే కనిపిస్తూంది. ఆమె ఠీవిగా నడుస్తూ వచ్చి రాజు ముందు నిల్చుంది.

"ఎవరు మీరంతా..."

ఆమె ప్రశ్నకు కళ్లెర్ర జేశాడు రాజు.

"నన్నే ఎరగవా...? ఎంత కావరం!"

"అన్నిటినీ అందరినీ ఎరుగుదుననుకోవడమే అజ్ఞానం. నన్నందరూ ఎరిగే ఉంటారనుకోవడం ఇంకా పెద్ద అజ్ఞానం. సరే, నువ్వెవరినని అనుకుంటున్నావో అది చెప్పు..." ప్రశాంతంగా నవ్వుతూ అందామె.

"నేనీ దేశాన్నేలే మహారాజుని."

"రాజువా? సరే, నన్ను సుమేధ అని పిలుస్తారు."

రాజుకి తన పరివారం ముందు తల తీసినట్ట యింది. మంత్రి గబగబా ముందుకొచ్చాడు.

"అమ్మాయీ! ముందు క్షమాపణ చెప్పు. మహా రాజుని మన్నించకపోవడం ఎంత నేరమో నీకు తెలిసి నట్టు లేదు."

"తెలియదు. నాకు తెలిసింది ఒక్కటే. సృష్టిలోని సర్వప్రాణులూ సమానమని మాత్రమే."

"కానీ రాజు మనతో సమానుడు కాడు. రాజరికం అనేది అత్యున్నతాధికారం గల పదవి. అతడు లోక పరి పాలకుడు, భూపతి, ప్రజారక్షకుడు."

"లోకాన్ని పాలించేది సృష్టి నియమం. భూమికి పతి ఉండడు. ప్రజలను రక్షించేది బుద్ధి. రాజరికం అనేది అధికారం కాదు బాధ్యత. అది అధికారం అని మీరనుకుంటే జరిగేది ప్రజాపాలన కాదు ప్రజాపీడన."

మంత్రికి నోటివెంట మాట రాలేదు. రాజుకి ఏమ నాలో తోచలేదు. 'అయినా మాటలతో ఏం పని ఈ కత్తి ఉండగా' అనుకున్నాడు.

"చూడు! అవన్నీ నాకు అనవసరం. అసలు ఇంత దాకా నన్ను ఎదిరించి బతికినవారు లేరు. స్త్రీవి కనుక నీయీ ప్రథమ తప్పిదాన్ని మన్నిస్తున్నాను. పోయి నీవారందరినీ మాకు లొంగి పొమ్మని చెప్పు. ఈ ప్రాంతాన్ని మా రాజ్యంలో కలిపినట్టు ప్రకటిస్తాం. అనవసర ప్రాణ నష్టం మాకు నచ్చదు..."

ఆమె ఫక్కుమని నవ్వి నిర్లక్ష్యంగా వెనుతిరిగి వెళ్ల సాగింది. రాజుకి మితిలేని కోపం వచ్చింది. గట్టిగా చప్పట్లు చరిచి సైనికులని పిలవబోయాడు.

మంత్రి భయపడుతూ వారించాడు.

"ప్రభూ! ఇది కొత్త ప్రదేశం. అసలే దారి తప్పి పోయాం. మన బలగం, ఆయుధాలూ ఎక్కడో దూరం గా ఉండిపోయాయి. క్రూరమృగాలు విచ్చలవిడిగా తిరిగే ఈ కీకారణ్యంలోనే ఈ రాత్రి గడపవలసి రావచ్చు. ఈ పరిస్థితుల్లో వారిని ఎదిరించి ఇక్కడి నుండి బయట పడడం అసాధ్యమేమో యోచించండి..."

"అవును ప్రభూ!" అన్నాడు విదూషకుడు.

రాజుకి ఒక్కసారి స్పృహ వచ్చినట్టయింది. చుట్టూ పరికించి చూశాడు. తనున్న పరిస్థితి అర్థమయ్యే సరికి అతడి శరీరం భయంతో కంపించింది. ఎదురుగా వున్న దృశ్య సౌందర్యానికి బదులు తన చుట్టూ ఆవ రించి వున్న అరణ్య స్వరూపం మరింత భీకరంగా కని పించసాగింది అతనికి.

విదూషకుడు ముందుకొచ్చాడు.

"ప్రభూ! తమరు క్షమిస్తే నాదొక్క మనవి."

"ఏమిటది...?"

"వారు శత్రువులని సహించరు కానీ అతిథులను ఆదరించకపోతారా...? తమరు అనుమతిస్తే ఆమెను పిలుస్తాను. ఈ రాత్రికి ఆశ్రయం కోరవచ్చు."

రాజు కోపంగా చూశాడు విదూషకుడి వైపు.

"మన్నించండి ప్రభూ! మనకు వారిని దగ్గరగా పరిశీలించే అవకాశం... వారి అనుపానులను తెలుసు కోగలిగే ఒకేఒక అవకాశం ఇదేకదా ప్రభూ..."

రాజుకి విదూషకుడి భావం అర్థమైంది.

అతడి ముఖంలో చిరునవ్వు చూసి గుండెనిండా ఊపిరి పీల్చుకున్నాడు విదూషకుడు.

వారిద్దరి తలల వెనగ్గా కొండల గుండెల్లోకి చిచ్చులా దూకుతున్నాడు సూర్యుడు.

*

హరిత ఛత్రంలాంటి చెట్టుకింద శుభ్రంగా అలికిన మట్టి అరుగుమీద కూర్చున్నాడు రాజు. సంజె వెలుగు లో మరింత సుందరంగా ప్రకాశిస్తున్న పరిసరాలను మైమరిచి చూస్తున్నారు అతడి పరివారం.

రాజుకి అవమానంగా ఉంది. తమని అక్కడ కూర్చోబెట్టి వెళ్లిన సుమేధ ఇంకా తిరిగి రాలేదు. చుట్టు పక్కల కనిపిస్తున్న మనుషులెవరూ తమని ప్రత్యేకంగా పట్టించుకోవడం లేదు.

ఇది అతని ఊహకు అందని విషయం. తను కోట దాటి బయటికి అడుగుపెడతాడంటే చాలు రాజ్యంలో ఎవరికీ కంటి మీద కునుకుండదు. జీవితం లో ఓసారైనా రాజదర్శనం చేయాలని కలలు కంటారు తన ప్రజలు. అందుకోసం ప్రాణాలనైనా లెక్కచెయ్యరు.

ఇక తను ఊరేగి వెళ్లే సందర్భాలలో, తనను దగ్గరగా చూడాలనే ఆతృతతో తన పాదాలు తాకిన భూమిని కళ్లకద్దుకోవాలనే ఉత్సాహంతో రథాశ్వాల కాళ్ల కిందపడి చనిపోయేవాళ్ల సంఖ్యకి లెక్కే ఉండదు.

అలాంటి నాకా ఈ అవస్థ అనుకున్నాడు.

అందుకు కారకుడైన విదూషకుడి మీద పట్ట లేనంత కోపం వచ్చింది. అంతలో అతడిచ్చిన సలహా గుర్తొచ్చి పరిశీలనగా చుట్టూ చూశాడు.

ఎటు చూసినా ఏదో పనిలో మునిగి ఉన్న మను షులే. అందరున్నా మాటా పలుకూ పెద్దగా వినిపించడం లేదు. శ్రమించడం కోసమే పుట్టినవాళ్లలా ఏకాగ్రతతో పనులు చేసుకు పోతున్నారు. వాళ్ల బలిష్టమైన ఆకారాలు చూస్తుంటే మంత్రి చేసిన హెచ్చరికలో ఎంత నిజముందో అర్థమౌతుంది.

వారి ఇళ్లని పరిశీలనగా చూశాడు రాజు. మట్టి గోడలూ, రెల్లుకప్పులూ. ఏ ఇంటికీ కిటికీలు కాదుకదా అసలు తలుపులే లేవు. మట్టికుండలూ, వెదురు మంచాలూ, ఈతచాపలూ, నారగుడ్డలే కనిపిస్తున్నాయి ఏ ఇంట్లో చూసినా.

ఓ ఇంటి ముందు గుంపుగా కూర్చొని మట్టి మూకుళ్లలో ఏవో తింటున్నారు కొందరు పిల్లలు.

ఆ ఇళ్లూ... ఆ మనుషులూ...

అసహ్యంతో ఒళ్లు జలదరించింది రాజుకి. అటు వంటివారి ఆతిథ్యంలో గడపవలసి వచ్చిన తన దుస్థితికి తనమీద తనకే జాలివేసింది.

ఈ అనాగరిక ఆటవిక మూకనా మంత్రి అంతగా పొగిడాడు. అంతలో సుమేధ వచ్చింది. ఆమె వెంట వచ్చిన మనుషులు కొన్ని ఆకుదొన్నెలూ, మట్టిపిడతలూ, వెదురుగొట్టాలూ, చిన్నచిన్న తట్టలలో ఏవేవో తెచ్చి అక్కడ పెట్టి వెళ్లారు.

అసహ్యంగా అనుమానంగా వాటివంక చూశాడు రాజు. మంచినీరూ, పాలూ, పళ్లూ, తేనే, కొన్ని దుంపలూ, ఇతర వంటకాలూ ఏవేవో ఉన్నాయి.

రాజుకి స్వర్ణపాత్రలలో తనకోసం అతి జాగ్రత్తగా తయారుచేయబడే రాజభోజనం గుర్తొచ్చింది. గజగజ లాడుతూ వడ్డించే సేవకులు గుర్తొచ్చారు. ఎంగిలి చేతిని పన్నీటితో తప్ప కడిగి ఎరగని తను ఈరోజు మట్టి మూకుడులో దుంపలూ, కాయలూ తినవలసి రావడం... హుఁ! ఏమి దురవస్థ...!

అయిష్టంగా తినడం మొదలుపెట్టాడు రాజు. ఆకలి మంట చల్లారుతున్నకొద్దీ అతడి మనసులో మరో విధమైన మంట మొదలైంది.

ఇదేం రుచి!!

మహారాజ వైభవాన్ని గురించే కాదు మహారాజ భోజనాన్ని గురించి కూడా ప్రజలు నిత్యం కథలు కథలు గా చెప్పుకొంటూ ఉంటారని చారులు చెప్తుంటారు. అటువంటి సర్వశ్రేష్టమైన ఆహారం నిత్యం తినే తనకే వీటి రుచి విస్మయం కలిగిస్తుందే!

చివరికి ఈ నీరు కూడా తనెన్నడూ ఎరగని అపు రూప పానీయంలా తోస్తుందే...!

ఏమిటీ వింత...! ఎక్కడిది వీటికీ రుచీ, ఈ పరి మళం...!

అనుమానంగా మంత్రి, మిగతా అనుచరుల దిక్కు చూశాడు.

నోళ్లు తప్ప సర్వాయవయాలూ నశించినంత తన్మయంగా తింటున్నారు వాళ్లు.

రాజు గుండె రగిలిపోయింది.

'సర్వశ్రేష్టమైన ఈ నేల... ఈ గాలి... ఈ నీరు... అన్నీ తనవి. తనవే కావాలి లేదా నశించిపోవాలి. అదీ కాదా కలుషించిపోవాలి. తప్పదు... తప్పదు...'

అతడి మనసు ఆక్రోశించింది.

*

వెన్నెలవానలో మైమరచి తడుస్తూంది సుచేతన.

పగలంతా శ్రమించి శ్రమించి అలసిపోయిన పౌరులంతా ఆ వెన్నెలలో సేదదీరుతున్నారు. ఆట పాటల కోలాహలంతో దిక్కులని నింపుతున్నారు. వాటి లోని ఆకర్షణకి వశులైపోయిన మంత్రీ, అనుచరులూ అంతా జీవితంలోని సర్వభయాలనీ ఆ క్షణం పూర్తిగా మరిచిపోయి, ఎదురుగా నిప్పులు కక్కుతున్న రాజు ఉనికిని కూడా విస్మరించి హాయిగా వాళ్లతో కలిసి పోయారు. విదూషకుడు కూడా వాళ్లతోనే చేరిపోవడం తో రాజు నిస్సహాయంగా కోపాన్ని దిగమింగుకుంటూ కూర్చున్నాడు.

"రాజా! ఇక్కడ ఉండిపోయావేం...? రా! మాతో కలువు. ఈ వెన్నెలని మనసారా ఆస్వాదించు. జీవితం లోని అసలైన ఆనందం ఏమిటో అర్థమౌతుంది..."

కాలు విరిగిన పులిపిల్లని ఆప్యాయంగా ఎత్తుకొని వచ్చిన సుమేధ నవ్వుతూ పిలిచింది.

నిరసనగా నవ్వాడు రాజు.

"మా కోటలోని చంద్రశాలల్లో ప్రతీరాత్రీ ప్రఖ్యాత కళాకారులు వచ్చి ప్రదర్శనలు ఇస్తూనే ఉంటారు. మేం

వాటిని చూడడమే చాలా అరుదు... ఇక ఇలా నడివీధులలో ఆడిపాడడం, ఆనందమా...! ఇటువంటివాటిని మా ప్రాంతాలలో అయినా పాటకపు జనం చూస్తారేమో గానీ మా నాగరిక సమాజాల్లో ఎవరూ హర్షించరు...''

ఫక్కున నవ్వింది సుమేధ.

''అలాగా! సరే, నీ ఇష్టం...'' అంటూ వెళ్లబోయింది.

''సుందరీ! ఆగు నీకు అభ్యంతరం లేకుంటే నీతో మాట్లాడాలి.''

''సరే! చెప్పు'' పులిపిల్లని జాగ్రత్తగా ఒడిలో వుంచుకొని కూర్చుందామె.

''నువ్వు వీళ్లకి రాణివా...?''

ఆమె నవ్వింది.

''ఇక్కడ ఎవరికెవరూ రాజులూ రాణులూ దాసులూ కారు. అవసరాన్నీ, సామర్థ్యాన్నీ బట్టి ఎవరైనా ఓ పనికి నాయకత్వం వహించవచ్చు. కానీ అది పదవి కాదు బాధ్యత. ప్రకృతికి తప్ప ఏ ప్రాణికీ ఇంకో ప్రాణి మీద అధికారం లేదని నమ్ముతాం. సంపూర్ణ స్వేచ్ఛతో జీవించే హక్కుతోపాటు ప్రకృతి నియమాలని పాటించి తీరవలసిన బాధ్యతని కూడా మనస్ఫూర్తిగా అంగీకరిస్తాం. ఇక్కడ ఏదీ ఎవరికీ సొంతం కాదు. అన్నీ అందరివీ. శ్రమించగలగడమే జీవితానికి సార్థకత అని మా భావన.''

వీళ్ల ఆకార వికారాలకి తగ్గట్టే ఉన్నాయి వీళ్ల వెర్రి మొర్రి పద్ధతులు కూడా అనుకున్నాడు రాజు.

పైకి మాత్రం- ''సుందరీ! మీ అభిప్రాయాలూ, విధానాలూ గొప్పవే కావచ్చుననుకో. కానీ మీ కట్టూ బొట్టూ ఇళ్లూ అన్నీ చాలా మోటుగా, అనాగరికంగా వున్నాయే. ఇంత సుందరమైన పరిసరాల్లో ఉంటున్నా ఆ సౌందర్యస్పృహ మీలో కొంచెం కూడా కనబడక పోవడం వింతగా ఉంది సుమా,'' అన్నాడు.

''రాజా! సౌందర్యం అంటే...? అసలు సౌందర్యాన్ని నువ్వెలా నిర్వచిస్తావో చెప్పు...'' అంది.

''సౌందర్యం అంటే ముఖ్యాతిముఖ్యంగా శరీరాకృతికి సంబంధించినది కదా. మా రాజ్యంలో వేలకొలదీ సౌందర్యనిపుణులు ఉన్నారు. వారందరూ ఎన్నో పరిశోధనలు చేసి, మానవ శరీరానికి కొన్ని నిర్ణీతమైన కొలతలున్నాయని కనిపెట్టారు. ఆ కొలతలకు ఎంత దగ్గరగా ఉంటే అంత సౌందర్యవంతులుగా లెక్క. అందుచేత ఆ కొలతల పరిధిలోకి రావడం కోసం మా దేశపు యువత ఎంతో శ్రమకోర్చి నిర్విరామంగా కృషి చేస్తూనే ఉంటారు. ఇంక వస్త్రాభరణాలూ, సౌందర్య సాధనాల వాడుక సంగతి చెప్పనే అక్కర్లేదు. వేలకొలదీ కర్మాగారాలు చేసే ఉత్పత్తి చాలక ఇంకా విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటూ ఉంటాం. ఇంక మా నివాస గృహాలూ, మా గృహాలంకరణలలోని సౌందర్యం చెప్పనలవి కానిది. నిజం చెప్పాలంటే మా ప్రజల సౌందర్య ప్రియత్వమే మాకు అధికాదాయాన్ని సమకూర్చిపెట్టే వ్యాపారవస్తువు...'' అన్నాడు.

''బహుశా రాజా! నువ్వు చెప్పేదంతా సంపన్నవర్గ ప్రజల గురించేనా...''

''అవును. అందుకు సందేహమెందుకూ...?''

''మరి సామాన్యుల సంగతేమిటి?''

''వాళ్లకేం... అదృష్టవంతులు. మా నాగరికతా, మేము సాధించిన అభివృద్ధీ సాటిలేనివి. శ్రమించేవాళ్ల కోసం నిరంతరం కొరత లేనంత పని సిద్ధంగా వుంటుంది. తేనెటీగలు మకరందాన్ని వెదుక్కున్నంత సులువుగా వాళ్లూ పనిని వెదుక్కుంటారు. శ్రమిస్తారు, తింటారు, నిద్రిస్తారు. రేపటి చింతలేని జీవితాలు. అందుచేతనే మా దేశంలో ఎక్కడ చూసినా చీమల పుట్టల్లా అల్లుకుపోయిన పాటకపు జనం కుప్పలు తెప్పలుగా కనిపిస్తుంటారు.

''ఆహాఁ! అంత గొప్పదా మీ అభివృద్ధి...? సరే, మరి నువ్వు చెప్పిన సౌందర్యస్పృహ వగైరాలేవీ వాళ్లకు ఉండే అవకాశం లేదన్నమాటేనా?''

''ఎందుకుండదూ...? వాళ్లు వాటిని ఆచరణలో చూపిస్తారు. అలా ఆ పనులు చెయ్యడంలో గొప్ప నైపుణ్యాన్ని సంపాదిస్తారు. వాళ్ల శ్రమ ఫలితాన్ని అభిరుచిగలవాళ్లకి అందించడం ద్వారా ఎనలేని మానసికానందాన్ని పొందుతారు. ఉదాహరణకి ఓ నేతపనివాడు రాత్రింబవళ్లు కష్టపడి నేసిన అద్భుతవస్త్రాన్ని ఓ మహారాజుకు కానుకగా సమర్పించగలిగినప్పుడో, ఓ శిల్పి తన కళానైపుణ్యాన్ని ఓ రాజసౌధ నిర్మాణంలో చూపించే అవకాశం పొందినప్పుడో ఎంతటి మానసికానందాన్ని పొందుతారో ఊహించగలవా...?''

నిట్టూర్చింది సుమేధ.

''నీ రాజరికం ఎంతటిదో నాకిప్పుడు పూర్తిగా అర్థమైంది రాజా!''

రాజు గర్వంగా నవ్వుకున్నాడు.

ఈమె తనని మొదట లెక్క చెయ్యకపోవడానికి కారణం అవగాహన లేకపోవడం. అంతే! ఈమెకి గనక తన సిరిసంపదలనీ, అధికార దర్పాన్నీ, విలాసజీవితాన్నీ రుచిచూపగలిగితే...

రాజు ఊహలు ఎటెటో పరుగులు తీశాయి.

దూరంగా, గుంపుగా చేరిన మనుషుల మధ్య చేరి తన ఇంద్రజాల విద్యతో, చమత్కార సంభాషణ లతో వారికి వినోదాన్ని కలగజేస్తున్న విదూషకుడు రాజువంక చూసి చిరునవ్వు నవ్వాడు.

''సరే, ఇక మీ గురించి చెప్పు'' అన్నాడు రాజు.

''సౌందర్యాన్ని కొలతపాత్రలలో పోసే పద్ధతి మాకు తెలీదుగానీ అది ఉండవలసింది జీవిత విధానం లో మాత్రమే అనుకుంటాం. సాధ్యమైనంతవరకూ మా జీవితాలని సుందరంగా ఉంచుకోవాలని కోరు కుంటాం. ఇక శారీరక సౌందర్యమంటావా, దానికసలు మా దృష్టిలో ప్రాధాన్యతే లేదు. అంటే ఉదాహరణకి కన్ను ఎంత పరిమాణంలో ఉన్నదీ అనికాక చూపు ఎంత నిర్దుష్టంగా ఉన్నదీ అనేదాన్నే మేం లెక్కలోకి తీసు కుంటాం. అడుగో సునేత్రుడిని చూడు...!'' ఓ చీకిరి కళ్లున్న మనిషిని చూపింది. ''అతడి దృష్టి అతి నిశితమై నది. అందుకే అతడికి ఆ పేరు వచ్చింది.''

''అయితే నీ పేరు కూడా నీ బుద్ధి నైశిత్యాన్నిబట్టి వచ్చిందేనా...?''

''అవును,'' కొంచెం సిగ్గుపడిందామె.

''బుద్ధిని మేము అతి ముఖ్యమైన ఇంద్రియంగా భావిస్తాం. ఇకపోతే మా కట్టూబొట్టూ వగైరాలంటావా? ప్రకృతిలో కలవనిదీ, అసహజమైనదీ అయిన ఏ చిన్న అంశానికీ మా జీవితాల్లో చోటు లేదు. మా తిండీ, బట్టా, ఇళ్లూ, గృహోపకరణాలూ చివరికి మేం వాడే ఆయు ధాలూ సమస్తం తప్పనిసరిగా ఈ సూత్రానికి కట్టుబడే ఉంటాయి.''

రాజుకి విషయం అర్థమైంది.

అక్కడి గాలీ, నీరూ, నేలా, తిండీ... సమస్తం అంత అద్భుతంగా ప్రత్యేకంగా ఎందుకున్నాయో తెలి సింది. ఆ మానవులు అంత శక్తివంతులుగా ఎందు కున్నారో కూడా తెలిసింది.

అప్పుడు...

అతని వెన్నులోంచీ పాములా పాకిందో భయం. దాంతో వణికాడు. ఆ భయాన్ని కప్పి పుచ్చుకుంటూ -

''సుందరీ! మీ ఆశయాలు గొప్పవే, ఆచరణీయ మైనవే. కానీ ఈ మారుమూల అడవిలో ఓ మూలకైనా రాని మీరు ప్రకృతిని ఎంత మేరకు కాపాడగలరో నాకు అర్థం కావడం లేదు. చూడబోతే మీ సంఖ్య కూడా అతి తక్కువగానే ఉన్నట్టు కనబడుతూందే...'' రాజు నేర్పుగా అడిగాడు.

''అది ఒకప్పుడు. ఇప్పుడు మా సంఖ్య అతివేగం గా పెరుగుతూంది. ఈ చుట్టుపక్కల గల దుర్గమార ణ్యాల్లో మాలాంటి జాతులు ఇంకా ఎన్నెన్నో ఉన్నాయి. మాకు దాదాపుగా రోగభయం లేదు. అనవసరపు అశాం తులూ, ఆందోళనలూ ఏవీలేవు. క్రమబద్ధమైన, ప్రశాంతమైన జీవితాలు మావి. చివరికి మరణం కూడా చెట్టునించీ పండు రాలిపడ్డంత తేలికగా అతి సహజంగా జరుగుతుంది. ఏ మనిషికైనా ఇంతకన్నా ఏం కావాలి రాజా...?''

ఓ క్షణం ఆగింది సుమేధ.

''నిజానికి పరమ శత్రువులా చూడవలసిన నిన్ను లోనికి పిల్చి ఆతిథ్యం ఇచ్చి ఇన్ని విషయాలని నీతో ఎందుకు చర్చిస్తున్నానో తెలుసా? నువ్వు చూసేదంతా నీమీద కొంచెమైనా ప్రభావం చూపకపోదనీ, నిన్ను నువ్వు కొంచెమైనా సంస్కరించుకొంటావనీ.

''ఎంతో అద్భుత జీవితాన్ని గడుపుతున్నానని గొప్పలు చెప్పుకుంటున్న నువ్వు నిజానికి ఎంత అశాంతి తో వేగిపోతున్నావో నిన్నో క్షణం పరిశీలనగా చూస్తే చాలు తెలిసిపోతుంది. చల్లని వెన్నెలని ఆస్వాదించలేని నువ్వు నెత్తుటి ప్రవాహాలని చూసి సంతోషించాలను కుంటున్నావే... ఎంతటి హీనస్థితి...! జంతువులు కూడా ఆకలి తీర్చుకోవడం కోసమే వేటాడాలనే నీతిని పాటిస్తాయి. కానీ నువ్వు...?

''నోరులేని అమాయక జీవాలని వేటాడడంలోనే ఇంత ఆనందాన్ని పొందుతున్న నీ పాలనలో నిస్సహా యులూ, బలహీనులూ అయిన ప్రజలు ఎంత సుఖ పడతారో ఊహించగలను...''

ఆమె లేచి నిలబడింది.

''రాజా! ఒక్కమాట. వేట కూడా ఒక నీతేననీ బల వంతుడు బలహీనుడిని చంపడం న్యాయమేననీ నువ్వ నుకుంటే... ఇప్పుడు నువ్వూ, నీ పరివారం మాతో పోలిస్తే అతి బలహీనులే. మానించీ ఎక్కడికీ తప్పించు కోలేని నిస్సహాయులే...''

అంతదాకా ఆమె మాటలు వింటూ కోపం పట్ట లేక దాన్ని బయటపెట్టలేక సతమతమౌతున్న రాజు ఆమె చివరి మాటలు విని తెల్లబోయి గజగజ వణక సాగాడు.

అది చూసి నవ్విందామె.

''భయపడకు రాజా! ఇంతటి ప్రాణభయాన్ని ఇంకో జీవితంలో కలిగించాలని చూడకు. అదే నేను నీకు చెప్పాలనుకుంటున్నది. నీ జీవిత విధానం మార్చుకో. లేదా అదే నీకు శాపమౌతుంది.''

ఆమె పులిపిల్లని ఎత్తుకొని వెనుదిరిగి అడుగులు వేసింది.

రాజు అవమానంతో కుంచించుకుపోయాడు. పగతో రగిలిపోయాడు. రెండో ఆలోచన లేకుండా కత్తి తీసి ఆమె తల తెగ్గొట్టాలనుకున్నాడు.

ఎప్పుడొచ్చాడో విదూషకుడు. నెత్తురు చిందు తున్న రాజు కళ్లలోకి నవ్వుతూ చూశాడు. అతడి చూపు ల్లోని సందేశం రాజుకి అందింది. రాజు కోపం మంత్రిం చినట్టు మాయమైంది. అతడి మాటలు వింటున్నకొద్దీ రాజు మనసు తేలికపడింది. అలా వినివిని వెన్నెల కూడా తేలిపోయేంత హాయిగా నవ్వాడు రాజు.

*

ప్రమిదలో ఆముదపు దీపం చల్లగా వెలుగు తూంది. ఆ వెలుగులో సుమేధ కళ్లు మిలమిలలాడు తున్నాయి కొంత ఆశ్చర్యంతోనూ, మరికొంత సంతోషం తోనూ.

'ఇది నేను సాధించిన విజయం కాదా, ఏమం టావు...?' అన్నట్టు చూసింది పక్కనే ఉన్న నిశితబుద్ధి వైపు. ఆలోచనగా చూశాడు అతడు.

''సుచేతనలో భిన్నాభిప్రాయాలు ఉండవు. మొదటిసారి అలా జరిగిందీనాడు. దానికి కారకుడు ఇతడు. ఏమైనా అంతిమ నిర్ణయం నీదే. అది అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటే మంచిది...''

నిశితబుద్ధి సలహాని కాదనలేకపోతూంది. కానీ రాజు కోరిక కూడా కాదు అనలేనిదే.

కొన్ని క్షణాల క్రితం...

''సుందరీ! నన్ను మన్నించు...''

అప్పుడే నిద్రకి ఒరగబోతున్న సుమేధ ఉలిక్కిపడి లేచింది. గుడిసె బయట తలదించుకొని నిల్చున్నాడు రాజు.

''నీ మాటలకి నేను కోపించిన మాట నిజం. కానీ ఇంతసేపూ ఆలోచించిన మీదట, నా తప్పు నాకు అర్థ మైంది. నా కర్తవ్యం కూడా నాకు బోధపడింది. ఇప్పుడు నాకు మీ సహకారం కావాలి.''

''మా సహకారమా... అంటే?'' ఆశ్చర్యంగా అడి గింది సుమేధ.

''ఒకసారి నీవారితో చిన్న సమావేశం ఏర్పాటు చెయ్యగలవా?''

''... ...''

''అసంభవం రాజా!'' అన్నాడు నిశితబుద్ధి రాజు కోరిక వినగానే.

రెండు దేశాల మధ్య స్నేహసంబంధాలు నెల కొల్పమనీ, పరిపాలనా విషయాల్లో తనకు సలహాలు ఇమ్మనీ రాజు కోరగానే నిశితబుద్ధిలాగానే అందరూ సుచేతన పౌరులూ వ్యతిరేకించారు.

''మీ నాగరికుల గాలి కూడా సోకరాదన్నది మా పూర్వీకుల నిర్ణయం. దానికి మేము కట్టుబడి ఉంటాం. ప్రాణభయంతో అల్లాడుతున్న మిమ్మల్ని చూసి జాలిపడి ఆశ్రయమిచ్చామేగానీ సూర్యోదయానంతరం మిమ్మల్ని ఇక్కడ ఉండనిచ్చే ప్రసక్తే లేదు. అలాంటిది మీ వ్యవహా రాల్లో మా జోక్యమా... వీల్లేదు...!''

వృద్ధుడైన నిశితబుద్ధి ఖచ్చితంగా చెప్పాడు.

''మీ పూర్వీకుల నిర్ణయానికి కారణం తెలుసు కోవచ్చా?''

''ఇదంతా ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యంత సంపన్నవంతమైన మహా సామ్రాజ్యం. ఇప్పటి నీ రాజ్యం కూడా ఇందులో ఒక భాగమే. ఆ చక్రవర్తి వంశీయులే మా పూర్వీకులు.''

రాజు నివ్వెరపోయాడు.

''ఒకప్పుడు ఆ రాజవంశంలో రాజ్యాధికారం కోసం అంతఃకలహాలు మొదలయ్యాయి. ఎడతెరిపిలేని రక్తపాతం జరిగింది. వేలాదిమంది ప్రజలు బల య్యారు. ప్రాణాలతో మిగిలినవారు దేశం విడిచి పారిపో యారు. రాజవంశం చాలావరకు తుడిచిపెట్టుకుపో యింది. అదంతా కలిగించిన విరక్తితో మా పూర్వీకులు రాజధానిని విడిచి ఈ ప్రాంతాలకి వచ్చి స్థిరపడ్డారు. వారి సంస్కరణల ఫలితమే ఇప్పటి సుచేతన.''

''నేను ఇప్పుడు అడుగుతున్నదీ అదే. నా పరి పాలనా విధానాలని సంస్కరించమనీ, అందుకోసం మన రెండు దేశాల మధ్యా స్నేహ సంబంధాలను నెల కొల్పమనే కదా. సుందరీ! నువ్వైనా ఆలోచించు...''

''రాజా! మా అందరి ఆలోచనా ఒకటే. నేను నీతో అంతగా చర్చించినది నీ ప్రజల పట్ల జాలితో. అంతేగానీ నీ విషయాలపై ఆసక్తితో కాదు.''

''అందుకే... ఆ ప్రజల కోసమే అడుగుతున్నాను మమ్మల్ని సంస్కరించమనీ, మా దేశాల్లో ప్రజలు మీ వంటి స్వతంత్రజీవులు కారు. ఒక్క పాలకుడి నిర్ణయాల పైనా, శక్తి సామర్థ్యాలపైనా కోట్లాదిమంది ప్రజల భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అందుకే మేము మంత్రులూ, సేనాధిపతులూ, ఇతర సలహాదారుల మీద ఆధారపడతాం. కానీ వారే అసమర్థులైతే, మమ్మల్ని తప్పు దారిలో నడిపించేవారైతే...?''

''కావచ్చు... అందుకే ఏ నిర్ణయమైనా తీసుకొనే ముందు నీ వివేచనని ఉపయోగించాలి రాజా! ఏమైనా మా కట్టుబాట్లని వదులుకొని నీకు సహాయపడడం అసాధ్యం...''

''సుందరీ! ఎందుకు సాధ్యంకాదు? సర్వ ప్రాణుల పట్లా మీరు చూపుతున్న కరుణ సాటి మనుషుల మీద చూపడం ధర్మం కాదా? అంతటి నిస్స హాయులకి మంచి చేసే అవకాశం వస్తే అంతకన్నా మీ మేధస్సుకు సార్థకత ఏముంటుంది?''

సుమేధ ఆలోచనలో పడింది.

''నిజమే, కానీ నీ సమస్యలని ఇప్పటికిప్పుడు ఇక్కడ పరిష్కరించడం కుదరదు. నీకు మార్గదర్శకత్వం వహించే వ్యక్తి అనుక్షణం నీ వెంట ఉంటూ అన్ని విష యాలనూ గమనించాలి. అది మాకెలా సాధ్యపడు తుందో చెప్పు...?''

''నీకు సాధ్యపడుతుంది''

''నాకా...! ఎలా?'' ఆశ్చర్యంగా అడిగింది.

''నువ్వు మా రాజ్యానికి రావడానికి అంగీ కరిస్తే...''

''సుచేతన పౌరులకు పరదేశవాసం ఎంతమాత్రం వీలుపడదు''

''నువ్వూ, నీవాళ్లూ అంగీకరిస్తే నిన్ను వివాహం చేసుకుంటాను. అప్పుడు నీకది పరదేశం కాదుకదా. నువ్వూ మా పౌరురాలివే అవుతావు''

''వివాహమా...!'' సందిగ్ధంగా చూసింది సుమేధ. మిగతావారిదీ అదే పరిస్థితి. మానసికంగా ఒకరికొకరు కట్టుబడి ఉండే పద్ధతే తప్ప 'నాగరిక' సమాజాల్లో వివాహబంధం ఎలాంటిదో వాళ్లకి అంతగా అవగాహన లేదు.

వాళ్ల సందిగ్ధత గమనించాడు రాజు.

''అవును. అప్పుడు నువ్వూ నాతో సమానురాలైన రాణివీ, సంపూర్ణాధికారిణివీ అవుతావు. నువ్వు ఇక్కడ లేకపోయినా వీళ్లకి వచ్చిన లోటేమీ లేదు. కానీ నీలాటి వ్యక్తుల నాయకత్వం మా ప్రజలకి ఎంతో అవసరం. ఆలోచించు...''

రాజు నిజమే చెప్తున్నాడా...? అతడిలో వచ్చిన మార్పు నమ్మదగినదేనా? ఆలోచనలో పడింది సుమేధ.

నిజమైనది అయినా కాకున్నా నష్టమేముంది...? రాజులో మార్పు తేగలిగితే ప్రజలు సుఖపడతారు. లేదా ప్రజల్లోనే మార్పు తేగలిగితే...? అప్పుడు రాజ్యమే బాగు పడుతుంది. ఒక గొప్ప సందర్భం...! అందులో పాల్గొనే అవకాశం వచ్చినప్పుడు అంతకన్నా జీవితానికి సార్థకత ఏముంటుంది?

చాలాసేపు మౌనంగా గడిపిన మీదట,

''నేను అంగీకరిస్తున్నాను...!'' నిశ్చలంగా చెప్పింది సుమేధ.

*

కొండలూ, కోనలూ, జనపదాలూ, పట్టణాలూ అన్నిటినీ దాటుకుంటూ పోతూంది రాజరథం.

రథానికి ముందు కొందరు మువ్వల కర్రలని మోగిస్తూ, బాణసంచా కాలుస్తూ, గొంతులు పగిలిపో యేంత గట్టిగా హెచ్చరికలు చేస్తూ, బాకాలు ఊదుతూ, చెమటలు కక్కుతూ పరుగులు తీస్తున్నారు రాజు రాకని ప్రజలకి తెలియజెయ్యడం కోసం. ఆ శబ్దాలని ఆలకిం చిన ప్రజలు గజగజలాడుతూ ముసలీ ముతకా పిల్లా జెల్లా రోగిష్టీ అనే తేడా లేకుండా దారులవెంట బారులు తీరి మోకరిల్లుతున్నారు. వండిన వంటా, పండిన పంటా, కలిగిన సొమ్మూ, నగలూ, నాణ్యాలూ- ఉన్న వన్నీ ఊడ్చి తెచ్చి సమర్పించుకుంటున్నారు. అలా తేలేని వాళ్లని కమ్చీలతో బాది క్రమశిక్షణనీ, రాజుపట్ల విధేయతనీ నేర్పుతున్నారు రాజభటులు.

''చూశావా! నా ప్రజలకి నాపట్లగల ప్రేమ,'' అన్నాడు రాజు.

నిశ్చేష్టురాలై ఆ తతంగాన్నంతటినీ గమనిస్తున్న సుమేధకు మాట పెగలలేదు.

ఓచోట ఇద్దరు పసివాళ్లు తగవుపడడం కనిపిం చింది. కారణం ఒక జామపండు. ఆ పిల్లల తల్లి నిరు పేదది. వాళ్లకి ఆరోజు దక్కిన ఆహారం అదే.

''అమ్మా! ఒక ఫలాన్ని ఇద్దరెలా తినగలరు?'' రథాన్ని వారి ముందు ఆపించి, చిరునవ్వు నవ్వుతూ అడిగాడు రాజు.

ఆ తల్లి గజగజ వణికిపోయింది.

''తినలేరు ప్రభూ!'' అంటూ ఆ పండుని వాళ్ల చేతుల్లోంచి లాక్కొని రాజు పాదాల ముందు పెట్టి పిల్లలని తీసుకొని వెళ్లిపోయింది.

మరొకచోట ఇద్దరు వృద్ధ దంపతులని లాక్కు వచ్చారు సైనికులు. ''వీరి ఏకైక పుత్రుడిని దొంగతనం నేరం మోపి, అక్రమంగా నిర్బంధించారని గోల చేస్తు న్నారు ప్రభూ!''

ప్రశాంతంగా నవ్వాడు రాజు.

''నిర్బంధించి ఉంచడం చాలా పొరపాటు. నిజమే. రేపే అతన్ని ఉరి తియ్యండి. ఖైదులో ఉన్నన్ని రోజులూ అతడి పోషణకోసం ఎంతో ప్రజాధనం

ఖర్చయి ఉంటుంది కదా! అందుకు పరిహారంగా వారి సర్వస్వాన్నీ ఖజానాకు జమ చెయ్యండి.''

దారి పొడుగునా అలా తీర్పులు చెప్తూనే వున్నాడు రాజు.

పుత్రులకి మరణశిక్ష విధించి వారి తల్లులకి 'వీర మాతా పురస్కారాలు' అందజేశాడు. భర్తలని వధించి వారి భార్యలకి తన అంతఃపురంలో 'రక్షణ' కల్పించాడు. తల్లిదండ్రులిద్దరూ శిక్షకి గురైనచోట వారి బిడ్డలను అనాథగృహాల్లో చేర్పించే అవకాశం కల్పించాడు.

రాజరికపు విశ్వరూపాన్ని విభ్రాంతితో చూస్తున్నది సుమేధ.

రాజుని సంస్కరించడం సరే,ఈ ప్రజలని చైతన్య వంతులని చెయ్యడం సాధ్యమా? అసలు తను ఏం చెయ్యాలి?... ఎక్కడినుండీ మొదలుపెట్టాలి...

ఆమె ఆలోచనల నుండీ తేరుకోకమునుపే కోటకి చేరుకుంది రాజరథం.

దుర్భేద్యమైన కోటగోడలనీ తన వెనుకనే మూసుకుపోయిన తాడిచెట్టంత ఎత్తుగల బ్రహ్మాండమైన ఉక్కు తలుపులనీ ఆశ్చర్యంగా చూసింది సుమేధ.

*

"సుందరీ! అన్నమాట నిలబెట్టుకున్నాను. నా రాజ్యంలో నా కోటలో నా ఆంతరంగిక వ్యవహారాల్లో నీకు తెలియని రహస్యం అంటూ ఇంకేదీ లేదు.''

సుమేధ మాట్లాడలేదు.

ఉద్యానవనంలో కొలను ఒడ్డున దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చుంది. కృత్రిమంగా నిర్మించిన ఆ కొలనులోని కలువలూ, తామరలూ, అక్కడక్కడ తేలియాడే నీటిపక్షులూ, హంసలూ అచ్చు సజీవమూర్తుల్లా కనిపిస్తున్నాయి. నిజానికి అవన్నీ మణిశిల్పాలు.

వాటిని చూస్తూ నిట్టూర్చింది సుమేధ.

"అవును రాజా! నీ రాజ్యస్వరూపం నాకిప్పుడు పూర్తిగా అర్థమైంది.''

"ఈ ఉద్యానవనాలూ, విలాసభవనాలూ, అంతఃపురాలూ, వస్తు ప్రదర్శనశాలలూ, ఆయుధాగారాలూ, ధనాగారాలూ, ప్రయోగశాలలూ, కర్మాగారాలూ అద్భుతమైన అత్యంత పటిష్టమైన భద్రతావ్యవస్థలూ, గూఢచర్య విభాగాలూ, సైనిక కేంద్రాలూ, మా నగరాలూ, పట్టణాలూ, మా క్రీడావినోదాలూ... నాగరికత విశ్వరూపం నా సామ్రాజ్యం...'' అంటూ రాజు గర్వంగా నవ్వాడు.

"ఇంకా నీవంటివారి సంస్కరణ దీనికి అవసరమనే భావిస్తున్నావా?''

రాజు వేపు నిశితంగా చూసింది సుమేధ.

"రాజా! నీకింతవరకూ ఎదురులేదు. నువ్వే విశ్వవిజేతవి. ఔనా?''

"అవును.''

"మరి వందల కోట్ల ప్రజాధనం వెచ్చించి ప్రతీక్షణం ప్రాణభయంతో అల్లాడిపోతున్నవాడిలా ఇన్ని భయంకర మారణాయుధాలనీ, శస్త్రాస్త్రాలనీ ఉత్పత్తి చేయిస్తున్నావెందుకూ? అవన్నీ చాలనట్టు భయంకర రోగకారక క్రిములనీ, ఘోర విషపదార్థాలనీ కూడా సేకరిస్తున్నావెందుకూ? ఎదురేలేని నీకెందుకింత శత్రుభయం...?''

"అనుక్షణం అప్రమత్తంగా ఉండడం... నిరంతరం యుద్ధానికి సిద్ధంగా ఉండడం వీర లక్షణం.''

"అంతటి యుద్ధవీరులకి పిరికితనం తగదే. మరి కోటలోని గది గదిలోపలా అన్ని రహస్య మార్గాలెందుకు కట్టించుకున్నావూ?''

"అది నా కోసం కాదు. నా ప్రజల ఆత్మగౌరవం కాపాడడం కోసం. రాజభక్తి అధికంగా గల నా ప్రజలు రాజవంశం శత్రువుల చేతుల్లో చిక్కి నిర్మూలించబడడం భరించగలరా?''

"హుం! జీవితంలో ఒక్కసారి కూడా తమ కష్ట సుఖాలను గురించి పట్టించుకోని రాజు మీద ప్రజలకి ప్రేమాభక్తీ! సరే- మరి ప్రజలమీద అంత ప్రేమ గలవాడివి నీ కన్నతల్లి మొదలుకొని నీ రాజ్య సరిహద్దులలోని చివరివ్యక్తి దాకా ప్రతీ ఒక్కరి మీదా నిఘావ్యవస్థని ఏర్పాటు చేశావేం...?''

"నీడని కూడా నమ్మకపోవడం రాజనీతి''

"రాజనీతి కాదు ప్రాణభీతి. కన్నతల్లి ప్రేమతో ఇచ్చిన ఫలాన్ని ఆరగించలేవు. కన్నబిడ్డని మనసారా ఎత్తుకొని ముద్దాడలేవు. నీ రాణుల అంతఃపురాల్లోకి స్వేచ్ఛగా ప్రవేశించలేవు. తినడం, తాగడం, నిద్రించడం లాంటి అతి సామాన్య విషయాల్లో కూడా స్వేచ్ఛని కోల్పోయి అనుక్షణం ప్రాణభీతితో, శత్రుభయంతో అందరినీ అనుమానిస్తూ భద్రతా ఏర్పాట్లని పేరు పెట్టుకొని నిజానికి నువ్వు అనుభవిస్తున్నది ఏకాంతవాస శిక్ష కాదా?... మహా సామ్రాజ్య నిర్మాతనని మురిసిపోతూ నువ్వు పొందుతున్న సౌఖ్యం ఎటువంటిదో ఒక్కసారి ఆలోచించు...''

రాజు మౌనం వహించాడు.

"ఇక నీ ప్రజలలో ఒక వర్గం నిరంతర విలాసాల్లో మునిగితేలుతూ వ్యర్థులుగా మిగిలిపోతుంటే మరో వర్గం అనుక్షణం నువ్వూ, నీ ఆశ్రితులూ పెట్టే హింసల

మధ్య నలిగిపోతున్నారు. ఇదంతా దేనికి దారితీస్తుందో గ్రహించావా?''

రాజు బలవంతంగా చిరునవ్వు తెచ్చుకున్నాడు.

''నిజమే. ఈ లోపాలన్నీ సవరించుకొనే మార్గం చెప్తావనే కదా నిన్ను ఒప్పించి ఇక్కడకు తీసుకొచ్చిందీ? సరే, పద.''

ఇద్దరూ రాజభవనం దిక్కుగా నడవసాగారు.

''సుందరీ! ఎంత సునిశితబుద్ధి నీది! నిన్ను అపురూపంగా సత్కరించాలని ఉంది. రేపే ఒక ఉత్సవం ఏర్పాటుచేస్తాను. నిన్ను నా రాణిగా ప్రజలకి పరిచయం చేస్తాను''

''నాకా రాణి పదవి వద్దు. ఇన్ని వందల మందిలో ఎన్నవ రాణినని నన్నా ప్రజలు గుర్తు పెట్టుకుంటారు...'' నవ్వింది సుమేధ.

''నీ యిష్టం... నీ యిష్టం వచ్చింది కోరుకో... అమూల్య రత్నాభరణాలూ, అపురూప వస్త్రాలూ. నువ్వెన్నడూ కనీవినీ ఎరగని అద్భుత వస్తువులూ...''

''రాజా! వాటి బరువు కింద అణగారిపోయే కదూ నీ రాణులలో ఒకరు మరణించిందీ, మరికొందరు అస్వస్థత పాలైందీ?''

''సరే! నీకు సంపూర్ణ స్వేచ్ఛ ప్రకటిస్తాను... కోటలో నిన్ను ఎవరూ ప్రశ్నించరాదని కట్టడి చేస్తాను.''

''అది స్వేచ్ఛ ఎలా అవుతుంది? స్వేచ్ఛ ఒకరిచ్చేది కాదు. అది జన్మహక్కు. రాజా! నాకేం కావాలో నేనేం చెయ్యాలో నేనే నిర్ణయించుకుంటాను.''

''సరే! ప్రస్తుతం ఈ గదిలో విశ్రాంతి తీసుకో. ఇంతదాకా నువ్వు చూడని అతి ముఖ్యమైన మందిరాల్లో ఇదొకటి''

ఓచోట ఆగి తలుపు తీశాడు రాజు.

ఆమె లోపలికి పోగానే తలుపులు మూత పడ్డాయి. వాటి వెనుకనుండి రాజు స్వరం కఠినంగా వినిపించింది.

''నీకేం కావాలో నువ్వేం చెయ్యాలో నిర్ణయించవలసింది నేను. నిన్నీ క్షణమే చంపగలిగి వున్నా వదిలిపెడుతున్నాను. ఎందుకో విను. నిన్ను బంధించిన ఈ స్వర్ణమందిరం నా రాజరికపు సమస్త వైభవాలకీ చిహ్నం. దానంతటినీ ఒకసారి బాగా పరిశీలించి చూడు. ఆ మందిరానికున్న మరో ద్వారం తెరిస్తే లోకంలోకెల్లా దుర్భరమైన జీవితాన్ని గడిపే పశుప్రాయులైన మానవులు నివసించే మురికికూపాలలోకి చేరుకుంటావు. మరి నీవు అక్కడి నుండీ తప్పించుకొని బయట పడలేవు. ఇక నీ జీవితమంతా వారి మధ్యనే రోగంతో, శోకంతో, దుర్భర దారిద్ర్యంతో గడపవలసిందే. గుర్తు పెట్టుకో! ఆ తలుపు మరి లోనికి తెరుచుకోదు సుమా!''

తలుపులు మూసుకుపోయినా చీకట్లో కూడా ఆ స్వర్ణమందిరం వెలుగులు విరజిమ్ముతూనే ఉంది. అక్కడక్కడ అమర్చిన మణిదీపాల కాంతులు గోడల మీద ప్రతిఫలిస్తున్నాయి.

రాజు చెప్పింది నిజం. జీవితకాలంపాటు అడుగు కూడా బయటపెట్టే అవసరం లేని విధంగా ఆ మందిరంలోనే మహా వైభవ విలాసాలతో గడపగలిగే ఏర్పాట్లున్నాయి. అందులోకి ఒకసారి ప్రవేశించినవారు శరీరాలనే కాదు చూపుని కూడా మరల్చుకోలేనంత అద్భుతంగా ఉంది.

అక్కడ ఉన్న విశేషాలను పరిశీలనగా చూసింది సుమేధ. గదిలోని అరలనిండా అపురూపమైన బంగారు జరీ దుస్తులూ, ఎటుచూసినా కుప్పతెప్పలుగా కనిపిస్తున్న అమూల్యాభరణాలూ... అలంకార సామగ్రీ, మరో చోట ఘుమాయించే పరిమళాలు వెదజల్లుతున్న ఆహార పాత్రలూ ఉన్నాయి. కుతూహలంతో వాటివంక చూసింది.

వాటిలో ఒక్కటి కూడా సహజసిద్ధంగా అంటే చెట్టుని పండిన పండుగానీ, నేలన పండిన పంటగానీ ఉన్నది ఉన్నట్టుగా అమర్చలేదు. అంతా కృత్రిమం.

రాజ్యానికి వచ్చిన ఇన్ని రోజుల్లోనూ ఏనాడూ రాజు కల్పించబోయిన సౌకార్యలను తను వినియోగించుకోలేదు. వస్త్రాభరణాలని తాకలేదు.

ఆకలికి తట్టుకోలేని వేళల్లో విధిలేక పళ్లూ, పాలూ తీసుకున్నదే తప్ప మరో విధమైన తిండిని తాను ముట్టలేదు.

అన్నీ తెలిసీ వీటన్నిటినీ అమర్చిన గదిలో తనని బందీని చెయ్యడంలో రాజు ఆంతర్యం ఏమిటి...?!

ఆలోచనగా వెనుదిరిగింది సుమేధ.

అక్కడ -

తాను ప్రవేశించిన బంగారు ద్వారానికి సరిగ్గా ఎదురుగా ఓ చిన్న ఇనుపతలుపు కనిపించింది. నిర్మించిన దగ్గరి నుంచీ దానినెవరూ తాకనట్టు ఆ తలుపు బాగా తుప్పు పట్టి బిగుసుకున్నట్టుగా కనిపిస్తుంది.

గది మధ్యని నిల్చున్నది సుమేధ.

చిరునవ్వు నవ్వుకుంది.

*ప్రజాసాహితి, అక్టోబరు 2002 సంచికలో 'నేలబారు ద్వారం' పేరుతో ప్రచురితమైంది.*